పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలుచోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలుకురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

- ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, లీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూస్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్ల దాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత

గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.



డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

- తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాలేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరువానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

కేసీఆర్‌నగర్‌కు పంచాయతీ సిబ్బందిని పంపవద్దు

- గ్రామ పంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న మండేపల్లి గ్రామస్తులు

మండేపల్లిలో పంచాయతీ సిబ్బందిని అడ్డుకుని ధర్నా చేస్తున్న గ్రామస్తులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 24: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ఇటీవలే తమ గ్రామంలో కేసీఆర్‌నగర్(డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం)ను కలుపద్దంటూ కలెక్టర్‌తోపాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో మండేపల్లి జీపీ నుంచి పంచాయతీ సిబ్బందిని కేసీఆర్‌నగర్‌లో పనుల కోసం అధికారులు పంపించగా, మంగళవారం వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించి, ఆందోళన చేశారు. మన సిబ్బంది మనకే.. మన నిధులు మనకే అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కేసీఆర్‌నగర్‌కు మా గ్రామ పంచాయతీ సిబ్బందిని పంపించవద్దని, గ్రామ నిధులు కూడా ఖర్చు చేయవద్దంటూ డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకుని, సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉద్యోగ ఉపాధి కల్పించాలి

- ప్రభుత్వ విప్‌కు దివ్యాంగ సమితి సభ్యుల వినతి

వేములవాడలో ప్రభుత్వ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

వేములవాడ, సెప్టెంబర్ 24:ఉపాధి కల్పనలో భాగంగా జిల్లా దివ్యాంగులకు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగ ఉపాధి కల్పించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను జిల్లా దివ్యాంగ సమితి సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. దివ్యాంగులకు పెట్రోల్ బంక్ కేటాయించాలని, వృద్ధాశ్రమం లాగా దివ్యాంగులకు ఒక హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమం లో అధ్యక్షుడు మాదాసు రాజేశ్, ఉపాధ్యక్షుడు యెల్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మా మిడాల నరేశ్ తదితరులున్నారు.

సెలూన్ ఏర్పాటును అడ్డుకోవాలి

తమ కులానికి సంబంధం లేని వ్యక్తి కార్పొరేట్ స్థాయిలో సెలూన్ ఏర్పాటు చేయడం ద్వారా తమ పొట్ట కొట్టేందుకు కుట్రలు చేస్తున్నాడని నాయీ బ్రాహ్మణ కుల వృత్తితో సంబంధం లేని వ్యక్తి సెలూన్ ఏర్పాటుకోసం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని వేములవాడ పట్టణ క్షురకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మొరపెట్టుకున్నారు. వేములవాడ పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు మంగళవారం ఆది శ్రీనివాస్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నాయీబ్రాహ్మణ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం నవీన్, గంగిపెల్లి చిరంజీవి, సారంపెల్లి సంతోష్, రమేశ్, శ్రీకాంత్, సాగర్, రాజు తదితరులున్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

వేములవాడ, సెప్టెంబర్ 24: దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శరత్‌కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవాన్ని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంజయ్య నేతృత్వంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్, మహేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 24: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గురుకుల డిగ్రీ కళాశాలో ఎన్ఎస్ఎస్‌డేను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పీఎస్ఆర్ శర్మ పేర్కొన్నారు. ఇక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి స్వప్న, దీప్తి, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 24 : ఎన్ఎస్ఎస్ డే పురస్కరించుకుని వలంటీర్ల సహకారంతో కళాశాలలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ దేవారాజు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కుమార స్వామి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

గంభీరావుపేట, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే పురస్కరించుకుని కళాశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. మా అనాథాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు అందించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ భద్రత' గోవిందా'

- సెల్‌ఫోన్లు, కెమెరాలతో ఆలయంలోకి భక్తులు
- తూతూ మంత్రంగా సిబ్బంది తనిఖీలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యంత్రాంగం

రాజన్న ఆలయంలో సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 24 : వేములవాడ రాజన్న ఆలయ భద్రత కరువైందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుప్రసిద్ధ శైవక్షేత్రంగా వెలసిన వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయానికి ఘన చరిత్ర ఉంది. అటువంటి ఆలయానికి భద్రత విషయంలో రాజన్న ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు అంటున్నారు. రాజన్నను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు కనీస అవసరాలను తీర్చడంలో ఆలయ అధికారులు వైఫల్యం చెందుతున్నారని స్థానికులు, భక్తులు వాపోతున్నారు. భక్తులు ఆలయ అధికారుల నిర్లక్ష్యంతో లగేజీతోపాటే ఆలయంలోనికి ప్రవేశిస్తున్నారు. ఆలయంలోనికి సెల్‌ఫోన్లు, కెమెరాలు నిషేధమని తెలిసినా కూడా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆలయ సిబ్బంది సైతం భక్తులకు సూచనలిస్తున్నారే తప్ప వారిని తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీంతో భక్తులు ఆలయంలోకి సెల్‌ఫోన్లు, వీడియో కెమెరాలతో ప్రవేశిస్తున్నారు. మొన్న జరిగిన వినాయక నవరాత్రోత్సవాల్లో కొందరు భక్తులు ఆలయంలోని మూలవిరాట్టు గణపతిని సెల్‌ఫోన్‌లో ఫొటోతీసి వారి బంధు,మిత్రులకు పంపాడు. భక్తులు ఆలయంలో షాటోలు, వీడియోలను చిత్రీకరించటంతో తోటి భక్తులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని మిగతా పెద్ద ఆలయాల తరహాలో ఆలయం ముందు భాగంలో భక్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి కెమరాలు, సెల్‌ఫోన్లు లేకుండా లోపలికి ప్రవేశించేలా చూడాలని అటు రాజన్న భక్తులు, ఇటు వేములవాడ పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

రేషన్ డీలర్‌షిప్‌లకు ప్రొసీడింగ్‌లు

- గుట్టుచప్పు కాకుండా రాత్రివేళలో ఇచ్చారంటూ బీఆర్ఎస్ శ్రేణుల ఆరోపణలు
- నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్

తహసీల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత బొల్లి రామ్మోహన్

సిరిసిల్ల, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) /కలెక్టరేట్: సిరిసిల్ల రెవెన్యూ పరిధిలో రేషన్‌డీలర్ల నియామక ప్రక్రియ గుట్టుచప్పుడు కాకుండా పూర్తయినట్లు తెలిసింది. ఖాళీగా ఉన్న 58 రేషన్‌డీలర్ల ఎంపిక కోసం ఇటీవల అర్హత పరీక్ష నిర్వహించారు. అర్హులైన వారి జాబితా విడుదల చేయకుండానే, అనుకూలంగా ఉన్న కొంత మందిని ఇంటర్వ్యూలకు పిలిచారు. దీంతో పరీక్ష రాసిన అభ్యర్థులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మరుసటి రోజు కలెక్టరేట్ ఎదుట రేషన్‌డీలర్లు సైతం నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా, మంగళవారం రాత్రి అధికారులు ఆఫీస్ వేళలు ముగిసిన తర్వాత ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వడం వివాదాస్పదమైంది. విషయం తెలుసుకున్న రేషన్ డీలర్లు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. బీఆర్ఎస్ నేత బొల్లి రామ్మోహన్ రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకుని మాట్లాడారు. దాదాపు రాత్రి 8గంటలకు ఒక్కొక్కరిని పిలిచి ప్రొసీడింగ్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. అక్రమంగా ప్రొసీడింగ్‌లు ఇవ్వాల్సిన దుస్థితి ఎందుకు దాపురించిందని మండిపడ్డారు. డీలర్‌షిప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో అభ్యర్థి వద్ద రూ.3 లక్షలు తీసుకుని డీలర్‌షిప్ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వెంటనే డీలర్‌షిప్‌లను రద్దు చేసి నోటిఫికేషన్ వేసే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం

- మర్రిపల్లిలో రైస్‌మిల్లులను తనిఖీ చేసిన అధికారులు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 24: వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలో మల్లయ్యకుంటను ఆక్రమించి రైస్‌మిల్లులను కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ భారతి, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, పొల్యూషన్ కంట్రోలర్ జ్యోతి, వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాతలు రైస్‌మిల్లును తనిఖీ చేశారు. మారుతి, మహాలక్ష్మీ రైస్‌మిల్లులకు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైస్‌మిల్లులను తనిఖీ చేశామన్నారు. మల్లయ్యకుంటను ఆక్రమించారని, పొల్యూషన్ అధికంగా వస్తున్న ఫిర్యాదు మేరకు విచారణ చేట్టామని, రిపోర్టును కలెక్టర్‌ను అందజేస్తామన్నారు. ఇక్కడ వేములవాడ టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ, సర్వేయర్ సంపత్, కార్యదర్శి వినోద్, వివిధ శాఖల అధికారులుఉన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 24: విద్యార్థులు చిన్నపట్టి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని ప్రిన్సిపల్ వనజ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చదువులతో పాటుగా సమాజానికి తమవంతు సహాయాన్ని అందించాలని సూచించారు. మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఇక్కడ ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్, అధ్యాపకులున్నారు.

మైనార్టీ విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో నిర్వహణ
- 8 పోస్టులకు 32 మంది హాజరు

కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : జిల్లాలోని మైనార్టీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులకు ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేసేందుకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా మైనార్టీ విద్యా సంస్థల్లో జూనియర్ లెక్చరర్ (జేఎల్) ఇంగ్లిష్, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ మ్యాథ్స్, టీజీటీ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జూలాజీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఆర్ఎల్‌సీ రాజేందర్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి మైనార్టీ ఆఫీసర్ రాధాభాయ్, ఓఎస్డీ సర్వర్‌మియా, ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, ఫాతిమా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 48 మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా, 32 మంది హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారు.

పరిహారం చెక్కుల అందజేత